

# ప్రయాణం

పి. చంద్రశేఖర అజాద్

పచ్చలైటు ఊపుతున్నాడు గార్డు.

"త్వరగా రా నాన్నా," చేతులు స్పృశిస్తూ అంటున్నారు పిల్లలు. మెల్లగా ముందుకు కదిలింది బండి. వారిద్దరి కళ్లలోనూ నీళ్లు. అప్రయత్నంగా అతను వారిని స్పృశించాడు. మెల్లగా తల ఊపాడు.

బండి వేగం పుంజుకొంది.

దశాబ్దం పైబడిందేమో అనుకున్నాడతను.

ప్రయాణం అతనికి కొత్తకాదు. నిరంతర ప్రయాణికుడతను. కానీ ఇప్పటి ప్రయాణం మాత్రం ఎప్పుడూ గుర్తుండేది.

"అనామికా- ఈ ప్రయాణం మరపురానిది. ఒకటే లోటు. నువ్వు లేవు," అన్నాడారోజు తిరిగి వచ్చాక.

"నా చిన్నతనంలో ఒకసారి వెళ్లాను. అయినా మీరు చూశారు. మీ దృష్టే వేరు. ఆ దృశ్యాల్ని గురించి మీరెంత బాగా మీ డైరీల్లో రాసుకుంటారో నాకు తెలుసు," అందామె.

"అది నీ అభిప్రాయం. అక్కడి కొండలూ ఆ సాయంకాలం- ఆ జలపాతపు హోరు. అవెంత అద్భుతమనిపించినా నువ్వు లేవు. అందుకే ఆ ప్రయాణం అసంపూర్ణం. మరలా నీతో వెళ్లాల్సిందే."

ఆయన కళ్లు చెమర్చాయి. కొంతమంది కొన్ని మాటలు నిలుపుకోలేరు. 'అనామికా' అంతే. రైలు పరిగెడుతోంది. జ్ఞాపకాల అలలు.

"చూడండి. నా గురించి మీరు ఆలోచించవద్దు. మీరు ప్రయాణం చేస్తున్నారు. అది మీకు ఇష్టం. కొనసాగించండి. నాకంటూ ఓ ప్రపంచం కావాలంటారు. మీరే నా ప్రపంచం ఎందుకు కాకూడదు. మిమ్మల్ని నడిపించే శక్తి నేను కావటం నాకు గర్వం కదా. అయినా ఇద్దరం ఎవరి ప్రపంచం వారు చూసుకుంటే పిల్లలేం కావాలి."

"ఈ ప్రపంచంలో మనకేనా పిల్లలుంది," అతను.

"నాకో పేరుంది. మీకో అమ్మాయి పుడితే అనామికా అందామనుకున్నారు. ఇప్పుడు నన్ను అలా పిలుస్తున్నారు. అంటే నాలో మీ అమ్మాయిని చూసుకుంటున్నారు. అవునా."

అతనికి మాటలు కరువు.

"అందుకే మీలో నన్ను చూసుకోవటం. పిల్లల్లో, కుటుంబంలో నన్ను చూసుకోవటం. మీరందరూ ఎదిగి నన్ను మరిచిపోతారా- విలువ ఇవ్వరా. నవ్వుకుంటా. అయినా ఈ ప్రపంచంలో నేను ఒక్కదాన్నేనా? ఎంత మందికి వారి వారి ప్రపంచాలు లేవు! ఇదే ఓ ప్రయాణం అని ఎందుకనుకోరు."

వేగం... వేగం... శరీరం కుదుపులకు గురవుతోంది.

"ఈ ప్రపంచంలోకి వచ్చినందుకు నాకు తృప్తిగా ఉంది. నా పని నేను చేశా. మీ అందరినీ ప్రేమించాను. మనవారికి ప్రేమించటం నేర్పాను. నా దిగులంతా మీ గురించే. ఈ సంవత్సరాలన్నింటా ఏదీ మిమ్మల్ని తృప్తి పరచలేదు. ప్రతిదానికీ సంశయమే. మీరు రాత్రులు నిద్రపట్టక పలవరిస్తూ మంచం మీద దొర్లుతున్నప్పుడు నా బిడ్డల్లానే దగ్గరకు తీసుకున్నా. నాకింకా బతకాలనుంది. మీ కోసం కేవలం మీకోసం."

అతను కిటికీ నుండి బయటకు చూస్తున్నాడు.

ఈ ప్రపంచాన్ని చుట్టి రావటం అతని ఆశయం, ఈ ప్రపంచాన్ని 'ఆమె'తో చుట్టి రావటం మహదాశయం. మధ్యతరగతి ఆర్థిక పరిమితులు వంటరి ప్రయాణాన్నే రాస్తే కాలం శాసనం చేసింది.

అతను కళ్లు మూసుకున్నాడు. ఇది దీర్ఘమైన ప్రయాణం. అయినా విసుగు కలగదు. జ్ఞాపకాల వరద తనని తాను విభిన్న రూపాల్లో చూసుకోగలిగేది ఇలాంటప్పుడే. ఇప్పుడు పగటి పూట ప్రయాణం. అప్పుడు మాత్రం రాత్రిపూట.

ఆంధ్ర రాష్ట్ర సరిహద్దులకావల ఉన్నారు. అందరూ బంధువులే. వారలా వెళ్లేముందు ఎన్ని రోదనలో. తెలుగువారే అంతదూరంలో పరిశ్రమలు నెలకొల్పింది. ఎలాంటి సదుపాయాలూ లేవక్కడ. అయినా అంత దూరం వెళ్లటానికో కారణం ఉంది. కొన్ని సంవత్సరాల పాటు ఎలాంటి పనులూ ఉండవు. తెలుగువారినే పనిచేయటానికి తీసుకున్నారు. అది ఒరియా ప్రాంతమయినా నూటికి అరవైమందికి పైగా తెలుగువారే.

ఒకే లైన్. రైలు మెల్లగా పోతుంటుంది. ఎటు చూసిన కొండల సముదాయాలు. రాత్రి అతనికి కనిపించిన దృశ్యాలింకా గుర్తున్నాయి. కొండలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. అతనికాశ్చర్యం కలిగింది. అక్కడేదో గుడి ఉండి ఉంటుందనుకున్నాడు. అయితే తోటి ప్రయాణికుడు చెప్పింది వేరు.

కొండలు వెలగటంకాదు మండుతున్నాయి.

ఆ ప్రాంతాల్లో వివిధరకాల గిరిజన తెగలున్నాయి. వారందరికీ జీవనాధారం ఆ కొండలే. ఆ అరణ్యాలే. ఆ చెట్లే. ఎవరో వాటిని అంటించి వెళ్తారు. ఆ నిప్పు రగిలి దావానలం అవుతుంది. గాలితోడు కలుస్తుంది. తిరిగి ఎప్పటికో చల్లారుతుంది. అంతకు ముందటి పచ్చటిచెట్లు నల్లగా మాడి బొగ్గులవుతాయి. గిరిజనులు వాటిని సేకరిస్తారు. ఆధునికులు వాటిని కొంటారు.

అంతేకాదు. ఆ కొండల మీద కొంత భాగం చదును చేస్తారు. అక్కడ విత్తనాలు నాటి వస్తారు. వానలు కురుస్తాయి. అవి మొలకెత్తుతాయి. చింత పండు, కందులు, తేనె, రకరకాలు వస్తువులు గిరిజనులు తెస్తారు. కారుచౌకగా కొంటారు. మురికిని శుభ్రం చేసే కొండచీపుళ్లు దొరుకుతాయి.

అతనాదృశ్యాన్ని ఆ రాత్రిపూట చూసి చాలా సంతోషించాడు. అంతలోనే వేదనకు గురయ్యాడు. ఈ వెలుగంతా విధ్వంసమా! పచ్చటి చెట్లను కాల్చి బీడు భూములు చేయటమా అనిపించింది.

"వాళ్లు మాత్రం బతకాలి కదండి. భూమిలేదు. భుక్తిలేదు. చదువులేదు. ఈ ప్రాంతం బాగా వెనకబడి వుంది. ఇక్కడో ఫ్యాక్టరీ ఉంది కాబట్టి ఈ మాత్రం. రోడ్లు వేయాలి. ఈ రైలుమార్గం రావటమే ఓ గొప్ప. అందుకే వీళ్లంతా ప్రకృతిబిడ్డలు. వీళ్లకి ఆధునికత తెలీదు. మోసం తెలీదు. ఆ కొండలెంతో వీళ్లూ అంతే."

నిజమేకదా అనుకున్నాడు. అతనెవరో మాట్లాడుతూనే ఉన్నాడు.

"ఈ ప్రాంతంలో ఏ గొడవలూలేవు చాలా ప్రశాంతంగా ఉంటుంది. ఒకటే బాధ. మనవారందరికీ దూరం అయిపోయాం. వాళ్లు రావాలన్నా మేం వెళ్లాలన్నా కష్టం. పిల్లల చదువులూ అంతే. తెలుగు నేర్చుకోవటం కష్టం. ఒకరోజున ఇక్కడికి రావటానికి అందరం ఏడ్చినవాళ్లమే. కొందరు ఇళ్లు కట్టుకుంటున్నారు. ఇప్పుడు వెనక్కి వెళ్లాలన్నా బాధే."

ఏమాత్రం విసుగు కలగలేదు వారి ఆచారాలు తెలుసుకున్నాడు. అక్కడి దేవతల గురించి చెప్పాడతను. ఆ వెన్నెల్లో మెలికలు తిరుగుతూ కనిపించిన నదిపాయ ఇంకా కళ్లల్లో మెదులుతూనే ఉంది. అక్కడ దిగటమే ఆలస్యం ఎంత సంబరమో ఎన్నెన్ని పలకరింపులో- రాత్రంతా కరుగుతూనే ఉంది.

"అబ్బ, మీ నదీ, మండుతున్న కొండలు ఎంత బాగున్నాయో."

"ఏమో మాకవి విశేషం కాదు, రోజు చూస్తూనే ఉంటాం. అయినా మీరూ తనూ కలసి రావలసింది."

"ఇదయినా అనుకోకుండా రావటం, ఈసారి తప్పకుండా కలిసి వస్తాం."

"మీరలానే చెబుతారు. ఎన్ని సంవత్సరాలకి మీరు వచ్చింది."

ఉదయమే కొండల చెంతకు ప్రయాణం. అక్కడే ఓ తెలుగు మాస్టారు కనిపించారు ఆయనకు. ఎంత సంతోషమో. మంచి భావుకుడు. అక్కడే రెండు గదుల ఇల్లు కట్టుకున్నాడాయన.

"ప్రాణం లేచి వచ్చిందండి. మాకిక్కడ మన వాళ్లు కనిపిస్తే పండగే. అన్నట్లు మేం తెలుగు పండగల్ని మరిచిపోతున్నాం. తెలుగు సంస్కృతిని మరిచిపోతున్నాం. తలుచుకుంటే ఎంత బాధో."

"మీరో సంస్థ ఏర్పాటు చేసుకోండి. మంచి పుస్తకాలు తెప్పించుకోండి. తరచుగా సమావేశం కండి. అయినా మీకింత అందమైన వాతావరణం ఉంది. ఇంకేం కావాలి."

ఆ మాస్టరు తన్మయత్వంతో చూసి అన్నాడు.

"కొండలంటే మీకంత ఇష్టమా?"

"అవును."

"అయితే ఈ కొండల్ని చూడండి. ఓ అపురూప దృశ్యం కనిపిస్తుంది."

అతను చూస్తుండగానే, చెప్పాడు.

"ఓ ముని గాఢ తపస్సులో ఉన్నట్లుగా ఉంది కదండీ."

నిజమే చాలా గొప్ప దృశ్యం.

ఓ ముని ఈ ప్రపంచాన్ని మరిచి కళ్లు మూసుకుని తపస్సు చేసుకుంటున్న రీతిలోనే ఉంది.

ఆ జలపాతాలు. ఆ గిరిజనులు. వారి అలవాట్లు... అదో ప్రపంచం.

అక్కడికి దగ్గల్లోనే ఇంకో ఫ్యాక్టరీ. అక్కడ మరి కొందరు బంధువులు. అతను అక్కడకు వెళ్లాడు.

అప్పుడే నిర్మించి ఇచ్చిన క్వార్టర్స్. రెండు గదులు. ఓ హాల్, కిచెన్ రూం, అద్దె నామమాత్రం. వారందరూ ఆడుకోవడానికి మంచి స్థలం ఉంది. ఇంక రిక్రియేషన్ క్లబ్ ఉంది. అందులో ఆంగ్లపత్రికలున్నాయి.

ఆ ప్రాంతంలో వివిధ భాషల ప్రజలున్నారు. వివిధ సంస్కృతుల వారున్నారు. అక్కడే ఓ స్కూల్ ఉంది. అంతా ఓ క్రమశిక్షణలో ఉన్నట్లుగా అనిపించింది. ఉదయం లేస్తారు. పిల్లలను స్కూల్‌కి పంపిస్తారు. షిఫ్టులు ప్రకారం ఫ్యాక్టరీకెళ్తారు, వస్తారు, భోం చేస్తారు. కొందరు క్లబ్‌కి వెళ్తారు. పార్టీలు చేసుకుంటాను. నిద్రపోతారు. అంతా ప్రశాంతం. తాపత్రయాలు ఉండవు. పిల్లలకి సీటు దొరుకుతుంది. వారంతా చదువుకుంటారు. బహుశా తిరిగి అక్కడే ఉద్యోగం వచ్చినా ఆశ్చర్యం లేదు. వారికి కొన్ని అభిప్రాయలుంటాయి. అవేవీ ఘర్షించుకున్నట్లుగా కనిపించవు. ఎవరూ ఎవరినీ కించపరిచేలా చూడరు. వారి ముఖాల మీద నవ్వులు వెలుగుతుంటాయి.

అదే ఆశ్చర్యం అనిపించింది. వీళ్లకేం గొడవలు ఉండవా అనుకున్నాడు. దేశంలో జరిగే విషయాలు వారిమీద ప్రభావం చూపించవు. తమ పుట్టిన ఊరు, ఎప్పుడన్నా బంధువులు, ఆ ఉద్యోగం, అదే ప్రపంచం.

అదే సుఖమా అనుకున్నాడతను.

ఆ రెండు రోజులూ పేపర్ చదవకపోయినా ఇబ్బంది అనిపించలేదు. ముందు అతని ప్రయాణాలూ, ఆందోళనలూ, నిరంతరం తపించే మనుషులు ఎవరూ గుర్తుకు రాలేదు. చాలీచాలని ఆదాయం ఇంకా సవాలక్ష తాపత్రయాలు స్పృశించనే లేదు. ఇదేదో అపురూపమే అనిపించింది. ఎంత భ్రమల్లో కూరుకుపోయాను అనుకున్నాడతను.

వెనక్కి ప్రయాణం. ఏదో నిరాశ. అసంతృప్తి. చూడవలసినదేదో మిగిలిపోయింది. తిరిగి రావాలి.

తప్పకుండా రావాలనుకున్నాడు. ఇప్పటికి తీరింది.

ముందే టెలిగ్రాం ఇవ్వటంతో స్టేషన్‌లో ఎదురు చూస్తున్నారు.

ఈసారి వాతావరణం వేరు.

'అనామిక' ను గుర్తు చేస్తున్నారు. ఆమెతో జ్ఞాపకాలు ఒక్కొక్కరూ చెబుతున్నారు. తెల్లవారింది. అతను ఓ పిల్లవాడితో సంచారానికి బయలుదేరాడు. ముందుగా ఆ మాస్టారి దగ్గరకే. ఏదో కొత్తదనం కనిపిస్తోంది. అలనాటి పాతదనం ఇంకా మిగిలే ఉంది. ఇప్పుడు రెండోలైన్ నిర్మాణాన్ని ఆయన గమనించాడు.

మాస్టారు కౌగిలించుకున్నంత పనిచేశాడు. ఆయన మాట్లాడుతూనే ఉన్నాడు.

'ఇంతకు ముందు వచ్చినపుడు మన సంస్కృతిని మరిచిపోతున్నాం అని చెప్పాను. మీ సూచన ప్రకారం ఓ సంస్థను ప్రారంభించాం. కొన్ని కార్యక్రమాలు చేశాం. కొంతకాలం పర్వాలేదు. తిరిగి వంటరివాడ్ని అయ్యాను. పదండి అలా వెళ్దాం. బాబూ నువ్వు వెళ్లు నేను తీసుకువస్తాను," అని పంపించేశాడు.

"ఈ కొండలు చూసి మీరెంత మురిసిపోయారో నాకు తెలుసు. మీకో దృశ్యం చూపించాలి."

అతనా దృశ్యం చూసి చలించిపోయాడు.

అంత భయానకంగా ఉందా దృశ్యం. ఓ అందమైన మేకపిల్ల చర్మం వొలిచేస్తే ఎంత భయంకరంగా ఉంటుందో అంత బీభత్సంగా కనిపించింది.

"ఇదేమిటి?" అన్నాడు.

"కొండను తొలుస్తున్నారు. రోడ్లకీ ఇళ్లకీ మాత్రమే కాదు. కొంతమంది డబ్బూ అధికారం ఉన్నవారి దాహానికి కూడా. ఎవరికందింది వారు తవ్వుకుపోవటమే."

అక్కడ నిలబడాలనిపించలేదతనికి.

''ఘోర తపస్సులో ఉన్న మునికి తపోభంగం కలిగిస్తున్నారు. అతను మహోద్రేకంతో లేస్తాడు. ఏ శాపాలు ఈ ప్రాంతాన్ని చుట్టుముడతాయో,'' దిగులుగా అన్నాడు.

ఊరినిండా ఏవేవో మార్పులు. ఎటుచూసినా ఆడియో వీడియో షాపులు. వీధులన్నీ పాటలతో హోరెత్తుతున్నాయి. వాటితోపాటు ఎటు చూస్తే అటు బ్రాందీ షాపులు. వాటి చుట్టూ మనుషులు.

అతనికి సంతృప్తి కలిగించింది గిరిజనులే. అయినా వారిలోనూ ఏదో మార్పు. వారు ఆధునికతను అందుకునే ప్రయత్నం చేస్తున్నారు.

''వాళ్లు మారుతున్నారు. కొద్ది కొద్దిగా తెలివి తెచ్చుకుంటున్నారు. అప్పట్లో వీరందరూ స్వార్థపరులుగా కనిపించేవారు. కొండల మీదా అరణ్యాల్లో చెట్లు నరికేవారు. తగలబెట్టేవారు. బొగ్గులు చేసేవారు. అదంతా ప్రకృతికి వారు చేస్తున్న అన్యాయంలా కనిపించేది. నా అనుభవం ఒకటే. వారు చేసింది చాలా స్వల్పం. వారేం చేసినా తిరిగి అందించారు. జానెడు కడుపు కోసం చేశారు. ఒక్క దశాబ్దకాలంలో పెట్టుబడి ఈ వాతావరణాన్ని ఎంతగా మింగేసిందో చూడండి.'' అతని కళ్ల ముందు రేపటి దృశ్యం.

అక్కడ కొండలుండవు. మంచిగాలి ఉండదు. ఈపాటి సంస్కృతీ ఉండదు. వెనక్కి తిరిగి వచ్చాడతను.

రెండు రోజుల తర్వాత ఇంకో ఫ్యాక్టరీలో పనిచేసే బంధువుల ఇంటికి వెళ్లాడు.

అప్పుడు క్వార్టర్స్ ముందు నాలుగు లారీలు కనిపించాయి. వాటిలోకి సామాన్లు ఎక్కిస్తున్నారు

''ఏమైంది?'' అడిగాడతను.

నిరాశతో నవ్వాడు బంధువు.

''ఫ్యాక్టరీ లాకవుట్ చేశారు. లోపల చాలా సమస్యలు. ఇదివరకు యూనియన్ ఉండేది కాదు. ఇప్పుడు నాలుగున్నాయి. జీతాల విషయం, ఇంకా ఇతర సమస్యలతో మేనేజ్‌మెంట్‌తో గొడవలు. ముఖ్యంగా ఈ ప్రాంతానికి రాజకీయ నాయకులు వచ్చారు. చాలా మెల్లగా ప్రాంతీయ సమస్యని రెచ్చగొడుతున్నారు. ఇప్పటికి ప్రమాదం లేదు. బహుశా మరో అయిదారేళ్లలో ఈ ప్రాంతాన్ని ఓ కుదుపు కుదిపినా ఆశ్చర్యం లేదు.''

అతను దిగ్భ్రాంతి చెంది చూస్తున్నాడు.

''ఈ జీవితాన్ని తలుచుకుంటేనే ఎంత నిరాశో, ఏ కొత్తదనం ఉంది. ఎప్పుడూ ఒకే తరహా పని. ఉన్న చోటులో కూడా మార్పుల కోసం మేం ప్రయత్నం చేయలేదు. బయటి ప్రజల గురించి పట్టించుకోలేదు. ఈ రోజున రోడ్డున పడాల్సి వస్తుంటే అర్థం అవుతోంది. భద్రత అనేది ఓ మాయ. ఏ క్షణం ఎవరు వీధిన పడతారో ఎవరికి తెలుస్తుంది?''

''మొన్నటిదాకా సౌకర్యాలు లేవనే బాధ. ఇప్పుడు వేగం కుదిపేసింది. ఈ టీ.వీలు తెచ్చిన విప్లవం సామాన్యం కాదు. ఈ జీవితాన్ని మా పిల్లలు ఆమోదించటం లేదు.''

అతనింకా ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

''కొంతమంది పొలాలు చౌకగా కొన్నారు. ఇక్కడ కొన్ని లక్షలు సంపాదించిన వారున్నారు. గిరిజనులకి కొన్ని హక్కులు కల్పించారు. వాటినిండా లొసుగులు. వారికోసం ప్లాంటేషన్ లాంటి పథకాలు. ఏదీ అమలు కాదు. వారిలో తిరుగుబాటు వచ్చింది. నిజం చెబుతున్నాం. ఈ ఉద్యోగాలతో తృప్తిచెందాం. అదెంత పొరపాటో ఇప్పుడు తెలుస్తోంది. మా పిల్లలకు ఇక్కడ చోటు దొరకదు. మేమూ కొత్త ప్రాంతాలను వెతుక్కుంటూ పోవలసిందే.''

నిద్రిస్తున్న క్రూరమృగాన్ని లేపితే ఇలానే వుంటుందేమో. అతనికాక్షణం 'జిప్సీ'లు గుర్తుకువచ్చారు. గాడిదల మీద బరువులు వేసుకొని, కాలినడకన తమ పిల్లల్తో సంచార జీవితం గడపడం గుర్తుకొచ్చింది.

మనుషులందరూ ఇంతేనేమో. ఎంత ఆధునికత. లారీల్తో- వస్తువుల్తో ప్రయాణం. కొత్త ప్రాంతం. మనుషులు- సంస్కృతి - తిరిగి ఎక్కడో ఏదో తెగుతుంది. మళ్లీ పరుగులు. నిన్న మంచిగా కనిపించింది నేడు కాదు. నిన్నటి సుఖం నేడు విషాదం. అంతా బోసిపోవటం. తిరిగి ఎక్కడో ఓ మెరుపు- మనుషులంతా అటు పరుగులు, అతని ఆలోచనలను తెంపుతూ మాటలు.

''మిమ్మల్ని చూస్తే ఎంత తృప్తో. నిరంతరం ప్రయాణం చేస్తున్నారు. మనుషుల్ని చూస్తున్నారు. వారి బాధల గురించి ఆలోచిస్తున్నారు. మీకు ఎన్ని ఎదురుదెబ్బలు తగిలితే ఏమిటి? మాదంతా ఓ కృత్రిమ ప్రపంచం.''

అతనికి అక్కడ ఉండాలనిపించలేదు. ఏదో బాధ. ఆ గాలిలోనూ ఏదో విష సంస్కృతి తాలూకు స్పర్శ.

అతనికి 'అనామిక' గుర్తుకొచ్చింది.

తనుంటే ఎలా ఉండేది? నవ్వుకునేదా? లేదా తన ముఖాన్ని చేతుల్లోకి తీసుకొని, ''ఎందుకీ ఊగిసలాట. ఏది ఆగుతుందని? నువ్వేం ఆపగలవని. పిచ్చి పిల్లవాడా ప్రయాణం మాత్రమే నిజం.

''నిన్నటి మనుషులు కాదు వీళ్లు. ఈ బాధల నుండీ, బీభత్సం నుండీ నేర్చుకుంటున్నారు. మార్చుకుంటారేమో. లేదా ఇంకా అధఃపాతాళంలోకి వెళ్లగలరేమో. పోతేపోనీండి. ఈ జీవితం సాహసవంతులది. నిరంతర ప్రయాణీకులదీ,'' అంటుందేమో.

అతనికాక్షణం తను లేనందుకు బాధ కలగలేదు.

ఆమెకు ఈ ప్రపంచంలోని అందాన్నంతా చూపించాలనుకున్నాడు. బీభత్సానికి వారి జీవితంలో కొదువ లేదు.

కానీ ఎల్లెడలా ఇదే దృశ్యమేనేమో!

ఆనందమూ- విషాదమూ- స్వార్థమూ- పోరాటమూ- తిరిగి తిరిగి అన్వేషణ - మళ్లీ ప్రయాణం.

వెనక్కి తిరిగి వస్తున్నప్పుడు మాస్టరు అడిగారు.

''మరలా ఎప్పుడు?''

''ఏమో రావాలని లేదు. ఓపిక ఉండదేమో''

''అలా అనకండి. నాకోసం రండి. మా కొండల కోసం. ఇవంత త్వరగా అదృశ్యం కావులెండి. మీరు నిరంతర ప్రయాణీకులు. ఓపికున్నంతవరకు ఆపకండి.''

''ఓసారి మీరు రండి,'' అన్నాడు.

''వస్తాను. తప్పకుండా వస్తాను. ఇంక సర్వీసు కూడా ఎంతో లేదు. ఇంతవరకు చూసింది లేదు. నేనూ తనూ కలిసి వస్తాం. మిమ్మల్ని చూశాకే మిగతావి.''

బండి కదిలింది. ప్రయాణం ఆరంభం అయింది.

'ముందుకా - వెనక్కా?' అనుకున్నాడు.

'చూసే దృష్టిని బట్టి ఉంటుంది,' జవాబు చెప్పుకున్నాడు.

'అవును,' అన్నట్లనిపించింది- 'అనామిక' గుసగుసగా.

*సుప్రభాతం పక్షపత్రిక, 5 మే 1995*

